క్లుప్తంగా

21న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

పీలేరు రూరల్ : ఈ నెల 21న పౌర్ణమిని పురస్కరించుకుని తిరువణ్ణామలై (అరుణాచలం)కు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపనున్నట్లు డీఎం కుమార్ తెలిపారు. పీలేరు డిపో ఒక ఎక్స్‌ప్రెస్ టికెట్ రూ. 700, ఒక ఆర్డినరీ టికెట్ రూ. 650 నడుపుతున్నట్లు తెలిపారు. ఎక్స్‌ప్రెస్ బస్సు మధ్యాహ్నం 1 గంటకు, ఆర్డినరీ బస్సు తెల్లవారి 5 గంటలకు బయలుదేరుతాయని తెలిపారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు కె.వి. రమణ 7893152748 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

17న బక్రీద్

మదనపల్లె సిటీ: బక్రీద్ పండుగ ఈనెల 17న (సోమవారం) నిర్వహించనున్నట్లు ప్రభుత్వ సర్‌ఖాజీ ఇక్బాల్ అహ్మద్ తెలిపారు. ముస్లిం సోదరులు పండుగను పవిత్రంగా జరుపుకోవాలని సూచించారు.

మల్లికార్జునస్వామి కళామండలి అధ్యక్షుడిగా శివశంకర్‌రెడ్డి



తంబళ్లపల్లె: మల్లయ్యకొండ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి కళామండలి అధ్యక్షుడిగా కురబలకోట మండలం అడవిపల్లెకు చెందిన శివశంకర్‌రెడ్డి ఎంపికయ్యారు. నియోజకవర్గంలోని కళాకారులు కొండపై జరిగిన సమావేశంలో శివశంకర్‌రెడ్డిని కళామండలి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళామండలి అభివృద్ధికి, కళాకారుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

నేటి నుంచి ఎంజేఆర్‌లో మెగాజాబ్ మేళా

పీలేరు రూరల్ : స్థానిక ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ ఎం.పి. అవినాష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 50కి పైగా కంపెనీలు, 1000కి పైగా ఉద్యోగాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, డిప్లమో, అన్ని డిగ్రీ కోర్సులు, ఇంటర్మీయట్ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

మదనపల్లె : మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని కురబలకోట మండలం అప్పినాయునిపల్లెలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్ట్‌చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అప్పినాయునిపల్లెకు చెందిన వి.మల్లీశ్వరి(35) కర్ణాటక బీర్లు అమ్ముతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. 9 బీరు బాటిల్స్ స్వాధీనం చేసుకోవడంతో పాటుగా మల్లీశ్వరిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపామని తెలిపారు.

గోవర్ధనగిరిలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సత్యభామ సమేత శ్రీకృష్ణుడు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం గోవర్ధగిరిలో వెలసిన శ్రీకృష్ణ ఆలయంలో సోమవారం ఆలయ రెండవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని రంగు రంగు విద్యుత్ దీపాలతో అలంకరణ అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు స్వామిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో ప్రవేశాలకు అడ్మిషన్లు

పెద్దతిప్పసముద్రం: స్థానిక మోడల్ స్కూల్లో వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శివకుమారి తెలిపారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఆరవ తరగతిలో 14 సీట్లు, ఏడవ తరగతిలో 42, ఎనిమిదవ తరగతిలో 50, తొమ్మిదవ తరగతిలో 37, ఇంటర్ మొదటి సంవత్సరంలో 32, ద్వితీయ సంవత్సరంలో 33 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్షయవ్యాధి లేని సమాజమే లక్ష్యం



మర్రిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

గుర్రంకొండ: క్షయవ్యాధి(టిబి) లేని సమాజమే లక్ష్య సాధనగా వయోజన బీసీజీ టీకాలను భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జిల్లా ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్‌రఫీ, వాల్మీకిపురం టీబీ యూనిట్ పర్యవేక్షులు నాగిరెడ్డి తెలిపారు. మండలంలోని మర్రిపాడు గ్రామంలో సోమవారం బీసీజీ టీకాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో టీబీ రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం టీకాలను ప్రవేశపెట్టిందన్నారు. వయోజనా బీసీజీ టీకాలు మరణాల తీవ్రతను నివారించడానికి దోహదపడతాయన్నారు. టీబీకి వ్యతిరేకంగా మనిషిలో రోగనిరోధక శక్తిని మరింత పెంచడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎటువంటి అనుమానాలకు తావులేకుండా టీకాలు వేసుకోవచ్చన్నారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని టీబీ వ్యాధిని తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రత్యూష, ఆరోగ్యసిబ్బంది రమణ, సురేంద్ర, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ టీకాతో క్షయ వ్యాధికి చెక్

వాల్మీకిపురం: క్షయ వ్యాధి లేని భారతదేశం లక్ష్య సాధన కోసం వయోజన బీసీజీ టీకాలు భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ సుధాకర్ అన్నారు. మండలంలోని నగిరిమడుగు పిహెచ్‌సి పరిధిలోని జర్రావారిపల్లిలో సోమవారం ప్రజలకు బీసీజీ టీకాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో టీబీ రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వయోజన టీకా చాలా సురక్షితమైందన్నారు. ఎంఎల్‌హెచ్‌పి మౌనిక, వైద్య సిబ్బంది మల్లీశ్వరి, ఆదిలక్ష్మి, శైలజ పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలతో తల్లీబిడ్డ క్షేమం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

పీలేరు : తల్లీబిడ్డ క్షేమం ఉండటానికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం తలపుల పీహెచ్‌సీలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమం నిర్వహించారు. పలువురు గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలిక్ యాసిడ్, కాల్షియం, అల్బెండోజోల్ 400 ఎంజీ మాత్రలు, 180 ఐఎఫ్ఏ మాత్రలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గర్భిణులు సమీప పీహెచ్‌లో వైద్య పరీక్షలు చేయించుకొని సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ప్రభుత్వాస్పత్రిలోనే సురక్షిత ప్రసవం సాధ్యమన్నారు.

టీటీడీ విశాంత్ర ఉద్యోగి మృతికి సంతాపం



అరుణ్‌కుమార్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: వాల్మీకిపురం కొత్తపేటవీధికి చెందిన టీటీడీ విశ్రాంత ఉద్యోగి గోపి అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మృతుడి స్వగృహానికి చేరుకొని, మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చింతల వెంట చింతల ఆనంద రెడ్డి, చింతల శివానంద రెడ్డి, కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్ తదితరులు ఉన్నారు.

ఎంజేఆర్ వైస్ చైర్మన్‌కు మాజీ ఎమ్మెల్యే నివాళి

పీలేరు : స్థానిక ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పీలేరుకు చేరుకుని అరుణ్‌కుమార్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.వి.చలపతి, హబీబ్‌బాషా, అబీద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం

కలికిరి: మండలంలోని గుండ్లూరు గ్రామం ఎర్రదొడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సదాశివరెడ్డి(75) ఆదివారం రాత్రి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సోమవారం ఎర్రదొడ్డిపల్లికి చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సింగిల్‌విండో చైర్మన్ పదవికి రాజీనామా



పీలేరు: రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న నారే వెంకటరమణారెడ్డి

పీలేరు : పీలేరు సింగిల్‌విండో చైర్మన్ పదవికి నారే వెంకటరమణారెడ్డి రాజీనామా చేశారు. సోమవారం రాజీనామా పత్రాన్ని సీఈవో వెంకటేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను సింగిల్‌విండో పదవి చేపట్టడానికి సహకరించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితోపాటు తనకు సహకరించిన వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అనివార్య కారణాల వల్ల తన పదవికి రాజీనామా చేసినట్లు చెప్పారు.

రామసముద్రం సింగిల్‌విండో అధ్యక్షుడు..

రామసముద్రం: మండంలోని సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవరెడ్డి తన పదవికి సోమవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత రెండు పర్యాయాలుగా సింగిల్‌విండో అధ్యక్షుడిగా అవకాశం లభించిందన్నారు. తనకు పాలనలో సహకరించిన అధికారులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పీఏసీఎస్ చైర్మన్ పదవికి రాజీనామా

కలికిరి: కలికిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ పదవికి నల్లారి శ్రీకర్ రెడ్డి సోమవారం రాజీనామా చేశారు. తనకు సహకరించిన నాయకులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు తన రాజీమానా పత్రాన్ని సీఈఓ కొండప్పకు అందజేశారు.

ఫిట్టర్ అవినీతిపై చర్యలు తీసుకోవాలని వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీవైఎస్ అధ్యక్షులు పునీత్

మదనపల్లె : మున్సిపాలిటీలో ప్రభుత్వం ద్వారా జీతం తీసుకుంటున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను మున్సిపల్ పనులకు కాకుండా సొంత వ్యవసాయ పొలంలో పనులకు వినియోగిస్తున్న ఫిట్టర్ రంగాచారిపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీలను కలిసి ఫిట్టర్ రంగాచారి అవినీతిపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ..నాలుగు నెలలుగా మున్సిపల్ వర్కర్స్‌ను పొలం పనులకు వినియోగించుకుంటూ, పనులకు రాని వారికి మస్టర్‌లో అటెండెన్స్ వేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఫిట్టర్ అవినీతిపై పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా, నేరుగా ఆధారాలతో సహా నిరూపించినా చర్యలు తీసుకోకపోవడంపై ప్రశ్నించారు. మున్సిపాలిటీకి చెందిన బోరుపైపులతో షెడ్ నిర్మాణం చేసుకోవడమే కాకుండా, మున్సిపల్ మోటార్లతో వ్యవసాయం చేస్తున్నాడన్నారు. నీటి కనెక్షన్లకు సంబంధించి కొన్ని వందల దాకా అవినీతికి పాల్పడ్డాడని, రంగాచారి విధులు నిర్వహిస్తున్న ప్రాంతంలో మున్సిపల్ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తే వాస్తవాలు బయటపడతాయన్నారు. తక్షణం విచారణ జరిపి, అతడిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బహుజన యువసేన నాయకులు నవీన్, శశికుమార్, బాలకృష్ణ, పూర్ణచంద్ర, వినయ్, జగదీష్, సాయి, ముని తదితరులు పాల్గొన్నారు.

జేఈఈలో మెరిసిన ఆణిముత్యం

రామాపురం : ఆదివారం విడుదల చేసిన 2024 జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో బొందల విష్ణువర్ధన్ ఆల్ ఇండియా ఓబీసీ కేటగిరిలో 207వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. బి.విష్ణువర్ధన్ అన్నమయ్య జిల్లా రామాపురం మండలంలో నల్లగుట్టపల్లి గ్రామం కొత్తపల్లికు చెందిన బొందల వెంకటరమణ కుమారుడు బొందల విశ్వనాథ్(ఉపాధ్యాయులు) సతీమణి బొందల నాగరత్నల చిన్న కుమారుడు. చిన్ననాటి నుంచి చదువులో ప్రతిభ కనబరుస్తూ జేఈఈలో మెరుగైన ర్యాంకును సాధించారు. బంధువులు, మిత్రులు విష్ణువర్ధన్‌కు అభినందనలు తెలియజేశారు.

14 నుంచి మారెమ్మ పొంగళ్లు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీలో వెలసిన మారెమ్మకు ఈనెల 14వ తేదీ నుంచి అమ్మవారి పొంగళ్ల మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14వ తేదీ శుక్రవారం ఆలయంలో మహాగణపతి పూజ, ధ్వజారోహణం, గణపతి హోమం, మారెమ్మ తల్లి మూలమంత్ర హోమాలు నిర్వహిస్తామన్నారు. 15న ఉదయం 8 గంటలకు చండీహోమం, విచ్చేసిన భక్తులకు మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని కల్పించినట్లు ఆలయ కమిటీ తెలిపింది. అదే రోజు వివిధ గ్రామాల నుంచి విచ్చేసే భక్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. సోమవారం అమ్మవారికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు జరుపుతామని తెలియజేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

గర్భిణులకు భోజన సదుపాయం

వీరబల్లె : వీరబల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు మండల ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి భోజన సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం ఎస్ఎంఎస్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు మధ్యాహ్న సమయంలో భోజన సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. గత రెండు సంవత్సరాల నుంచి ప్రతినెలా సేవాభావంతో మండల ప్రజలకు భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

శాఖాహారంతో ఆరోగ్య సమస్యలు దూరం

రాజంపేట టౌన్ : మనిషి శాఖాహారం తీసుకోవడం వల్ల దీర్ఘకాలికమైన కొన్ని ఆరోగ్య సమస్యలు దరిచేరవని భీమవరానికి చెందిన బ్రహ్మవిద్యారిష్ట తటపర్తి రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక సరస్వతి పిరమిడ్ ధ్యాన మందిరంలో సోమవారం ఆమె ఆత్మజ్ఞానంపై బోధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మీ పట్టణ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. శాఖాహారం వల్ల మనిషి ఆరోగ్యంగా ఉండటంతోపాటు జ్ఞానోదయం పెంపొందుతుందన్నారు. మాంసాహారం తినడం వల్ల మెదడు మందగిస్తుందని, అందువల్ల మనిషి ఆలోచనల్లో చురుకుదనం లోపిస్తుందన్నారు. ప్రస్తుతం కొన్ని జబ్బులు మాంసాహారం తినడం వల్లే సంక్రమిస్తున్నాయన్నారు. ముఖ్యంగా విద్యార్థులు మాంసాహారానికి దూరంగా ఉండాలన్నారు. శాఖాహారం తీసుకుంటే మెదడు చురుకుగా పనిచేస్తుందన్నారు. మనిషి ఆహారపు అలవాట్లతోపాటు సమాజంలో మంచి నడవడికను అలవరుచుకోవాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం ఏదో ఒక సమయంలో విధిగా ధ్యానం చేయాలన్నారు. అలాగే భగవంతుడి స్మరణలో ఉండాలని అప్పుడే మనిషి మనసును తన అదుపులో ఉంచుకోగలడని తెలిపారు. ప్రస్తుతం టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కుతోందని, ప్రపంచమంతా కొత్తదనం వైపు పరుగెడుతోందని చెప్పారు. ఈ కారణంగా అనేక మంది తాము కూడా ఇతరులతోపాటు విలాసవంతమైన జీవనాన్ని గడపాలన్న కోరికతో డబ్బు సంపాదన కోసం కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడిపే మధురమైన క్షణాలకు దూరమవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

పచ్చదనం పరుచుకున్న హార్సిలీహిల్స్



బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై పచ్చదనం పరచుకుంటోంది. వేసవిలో అడవి పచ్చదనం కోల్పోయి వృక్షాలు, మొక్కలు వాడిపోయి చల్లదనం కరువైంది. ఎటుచూసిన ఎండిపోయిన అడవి తప్ప పచ్చదనం కానరాలేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో హార్సిలీహిల్స్, చుట్టూ ఉన్న కొండలు పచ్చదనంతో అలరిస్తున్నాయి. చల్లటి గాలులతో వాతావరణం ఆహ్లాదపరుస్తోంది. దీనితో కొండకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది.

-బి.కొత్తకోట

సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తాం



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న రామకృష్ణ

మదనపల్లె సిటీ: వాసవీ ఇంటర్‌నేషనల్ క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని క్లబ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక పుంగనూరు రోడ్డులోని గోశాల వద్ద పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య మహిళలకు ఆలంబన ఫించన్లు ,గోశాలకు పచ్చిగడ్డి కోసం రూ.3 వేలు నగదు అందజేశారు. బోయకొండ ఆర్చ్ వద్ద మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది వలసపల్లి వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది పేద ఆర్య వైశ్య మహిళలు కుటీర పరిశ్రమ పెట్టుకోవడానికి రూ.2.50 లక్షలు వడ్డీ లేని రుణం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఐఈసీ ఆఫీసర్స్ కృష్ణమూర్తి, వెంకటేష్‌బాబు, సురేష్‌బాదబు, పులి రాజా ఆనంద్, మహీధర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండపై భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో మల్లికార్జునస్వామివారు

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువైంది. సోమవారం అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు చేసి స్వామి దర్శనంతోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు. మదనపల్లె-1డిపో మేనేజర్ భక్తుల సౌకర్యార్థం 2 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు.

పుంజుకుంటున్న టమాటా ధరలు



మదనపల్లె మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

మదనపల్లె సిటీ: టమాటా ధరలు రోజు రోజుకు పుంజుకుంటున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఇతర రాష్ట్రాలో పంట దిగుబడులు తగ్గుముఖం పట్టాయి. దీంతో మదనపల్లె మార్కెట్‌లో ధరలు పెరుగుతున్నాయి. సోమవారం మొదటి రకం కిలో రూ.62 పలికింది. సుమారు 564 మెట్రిక్ టన్నుల కాయలు వచ్చాయి. రైతుల నుంచి వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ధరలు పెరుగుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండటంతో పంటలు దెబ్బతింటున్నాయి. మదనపల్లె టమాటా మార్కెట్‌లో మంచి నాణ్యమైన కాయలు వస్తుండటంతో వ్యాపారులు మదనపల్లె మార్కెట్‌కు వస్తున్నారు. ధరలు ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని మార్కెట్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

రెడ్డెమ్మకొండ ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న రామకృష్ణ దంపతులు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రెడ్డెమ్మకొండ ఆలయ పునర్నిర్మాణానికి లక్కిరెడ్డిపల్లె మండలం మద్దిరేవుల గ్రామానికి చెందిన కావలి నాగరత్నమ్మ, రామకృష్ణ దంపతులు, రూ.25,116, వీరితో పాటు చిత్తూరుకు చెందిన జి.శోభ, రెడ్డెప్పరెడ్డి దంపతులు రూ.25,116 విరాళాలుగా అందజేశారు. సోమవారం ఆలయానికి విచ్చేసిన దాతలకు ఆలయ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం దాతలు రామకృష్ణ, రెడ్డెప్పరెడ్డి దంపతులు విరాళ మొత్తాన్ని ఈవో మంజులకు అందజేశారు.

ఘనంగా పైడిమర్రి జయంతి



పైడిమర్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేవీవీ అధ్యక్షులు, విద్యార్థులు

వాల్మీకిపురం: ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతిని సోమవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక తరిగొండ రోడ్డులోని మైనార్టీ బాలికల జూనియర్ కళాశాలలో పైడిమర్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేవీవీ అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ భారతదేశం నా మాతృభూమి అనే ప్రతిజ్ఞ ద్వారా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతి ఒక్కరి గుండెల్లో దేశభక్తిని, జాతీయ సమైక్యతను, సమగ్రతను చాటిచెప్పిన తెలుగువాడు పైడిమర్రి అన్నారు. ప్రతిజ్ఞ గొప్పతనాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమామంజుల, అధ్యాపకులు లోకనాథం, బాబాజాన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

వాల్మీకిపురం: చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకునేందుకు 41 సంవత్సరాల తర్వాత స్నేహితులంతా కలుసుకున్నారు. సోమవారం మండలంలోని చింతపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1982-83 బ్యాచ్ పదవ తరగతి చదువుకున్న వారు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఒకరిని ఒకరు పలకరించుకొని, బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శేషాద్రి యాదవ్, మనోహర్‌రెడ్డి, లోకనాథ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, హరినాథ ఆచారి, కన్నయ్య శెట్టి, స్వామిరెడ్డి పాల్గొన్నారు.